దళితరత్న అవార్డు ప్రదానం



మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న దృశ్యం

ఉప్పల్: ప్రముఖ సంఘ సేవకులు ఉప్పల్‌కు చెందిన సుక్క కిరణ్‌కు దళితరత్న అవార్డు దక్కింది. దళితహక్కులు, ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతులమీదుగా ఈ ఆవార్డును అందుకున్నారు. దశాబ్దకాలంగా చేస్తున్న సేవలకు తనకు ఈ ఆవార్డు వచ్చిందని, తనకు సహకరించిన పెద్దలు, ఉద్యమ నాయకులకు కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



స్టామ్‌వాటర్ లేన్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్, నాగార్జుననగర్ కాలనీల్లో జరుగుతున్న స్టామ్ వాటర్‌లేన్ల నిర్మాణపనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. స్టామ్‌వాటర్ లేన్‌ల నిర్మాణం పూర్తయితే వరదనీటి సమస్యను అధిగమించే అవకాశం ఉందన్నారు. ఇంజినీరింగ్ ఏఈ స్వరూపతో పాటుగా స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

‘ఈసీఐఎల్’కు మినీరత్న హోదా

కుషాయిగూడ: నగరంలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ‘ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్’ (ఈసీఐఎల్)కు మినీరత్న హోదా దక్కింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్‌కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల సమష్టి కృషితోనే ఇలాంటి గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ స్థిరమైన పనితీరుతో ఆర్థిక మంత్రిత్వశాఖలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (డీపీఈ) విభాగం నిర్దేశించిన అర్హతను సాధించినందుకు భారత ప్రభుత్వ అణుశక్తి విభాగం ఈసీఐఎల్‌కు ‘మినీరత్న’ (కేటగిరి–1) హోదాను కల్పించి అవార్డును ప్రకటించింది. సీఎండీ మాట్లాడుతూ.. ఈ హోదాతో స్వయం ప్రతిపత్తిని సాధించడంతో పాటుగా మార్కెట్‌లో సంస్థ ఖ్యాతీని పెంచుతుందన్నారు. గత కొన్నేళ్లుగా సంస్థ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. నిజాయితీగా సంస్థ ప్రగతి కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎలక్ట్రానిక్ రంగంలో దేశ ఆత్మనిర్భరత, దార్శనికతను బలోపేతం చేసే దిశగా ముందుకుసాగాలన్నారు.

మైసమ్మ ఆలయానికి విరాళం

రామంతాపూర్: రామ్‌శంకర్‌నగర్‌లోని రక్త మైసమ్మ ఆలయానికి సోమవారం యాదవసంఘం నేత సర్వ శ్రీనివాస్‌యాదవ్ తన కుమారుడు రేవంత్‌యాదవ్ జ్ఞాపకార్థం రూ.1,0116లు ఆలయ ప్రధాన అర్చకులు గోవిందరాజులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వివిధ దేవాలయాల అభివృద్ధికి రూ. 26 లక్షల వితరణ చేశానని చెప్పారు. ఆలయ ప్రతినిధులు సుర్వీ మురళీగౌడ్, బీరప్ప, చిత్తూర్ అశోక్‌చారి, రాము, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.68 లక్షలతో అభివృద్ధి పనులు



బాక్స్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణకాలనీలో రూ.68 లక్షలతో చేపట్టనున్న బాక్స్ డ్రైనేజీ పనులకు సోమవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాక్స్ డ్రైనేజీ నిర్మాణంతో వరదనీరు కాలనీలో నిలువకుండా సాఫీగా వెళ్లిపోతుందన్నారు. డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఏఈ ప్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి, స్థానిక నేతలు తాండా వాసుగౌడ్, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు భానుచందర్‌రెడ్డి, కటార్ల శేఖర్‌బాబు, శ్రీనివాస్‌రావు, ప్రదీప్, బిక్షపతి, లక్ష్మణ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు వచ్చేశాయ్ !

- గోదాం నుంచి మండలాలకు పాఠ్య పుస్తకాల సరఫరా
- జిల్లాకు పార్టు–1 మొత్తం పాఠ్యపుస్తకాలు 5.49 లక్షలు
- బడులు ప్రారంభం రోజే విద్యార్థులకు పంపిణీకి చర్యలు

నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి 20 రోజుల ముందుగానే బడులకు పుస్తకాలను తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రంలోని గోదాంకు చేరాయి.

– సాక్షి, సిటీబ్యూరో



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రామంతాపూర్ గోదామ్ నుంచి మండల కేంద్రాలకు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో యూడైస్ ప్లస్ వివరాల ప్రకారం.. మొత్తంగా 7.72 లక్షల పాఠ్యపుస్తకాలతో సహా వర్క్‌బుక్స్ రావాల్సి ఉందని, జిల్లా విద్యాశాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. జిల్లాకు పార్టు–1 కింద 5,49,630 పాఠ్యపుస్తకాలు అవసరమని అంచనా వేయగా.. ఇప్పటివరకు 4,63,150 పాఠ్య పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. ఇంకా 86,480 పుస్తకాలు రావాల్సి ఉంది. జిల్లాలో మొత్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 85,465 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

రెండు భాగాలుగా అందజేత

ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, ఆదర్శ పాఠశాలలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తుంది. వీటిని పార్ట్–1, పార్టు–2లుగా విభజించి సరఫరా చేస్తారు. జిల్లాకు పార్టు–2 కింద 2,23,370 వర్క్‌బుక్స్, వర్క్‌షీట్లు, స్టూడెంట్ వర్క్‌షీట్స్ తదితర పుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇవి ఆగస్టు నాటికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా ఎంఈవోల సమక్షంలో పంపిణీకి జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

20 నుంచి పాఠశాలలకు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని మండల కేంద్రాల్లో ఈనెల 20న యూపీఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెండో విడతలో భాగంగా బోధన పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలోనే పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందించాలని విద్యాధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడులు ప్రారంభమయ్యేనాటికి పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. పుస్తకాలు పక్కదారి పట్టకుండా వాటిపై వరుస సంఖ్యలను ముద్రించారు. వీటి ఆధారంగా ఎన్ని మండలాలకు, ఏయే పాఠశాలలకు పుస్తకాలు అందాయన్నది’ రికార్డుల్లో పక్కాగా తేలనుంది. 1–10 తరగతుల విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో ఓ వైపు తెలుగు, మరోవైపు ఆంగ్ల మాధ్యమంలో పాఠాలను ముద్రించారు. 3–10 తరగతుల వారికి పార్టు–1, పార్టు–2 పంపిణీ చేయనున్నారు. ఈ విధానంలో విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గనుంది. పుస్తకాల్లోని ప్రతి పాఠానికి బార్ కోడ్ ముద్రించడంతో సెల్‌ఫోన్‌తో స్కాన్‌చేస్తే ఆ పాఠాన్ని వీడియో రూపంలోనూ చూసుకునే సదుపాయముంటుంది.

84 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయి..



జిల్లాకు ఇప్పటి వరకు 84 శాతం పుస్తకాలు వచ్చాయి. మిగతావి వారం రోజుల్లో వస్తాయి. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు ఎంఈవోల సమక్షంలో పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం..మిగిలిన 16 శాతం పుస్తకాలు త్వరలో వస్తాయి. బడుల ప్రారంభం రోజే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందజేయాలనుకుంటున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా

కమర్షియల్ షెట్టర్లపై అధికారులు స్పందించాలి

కాప్రా: ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో కాప్రా జీహెచ్‌ఎంసీ అధికారులు విఫలమయ్యారని, ఆరోపిస్తూ.. నిరసన చేస్తున్న సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ గగన్‌కుమార్‌ను పోలీసులు సోమవారం ప్రివెంట్ అరెస్ట్ చేశారు. అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 నెలలుగా కాప్రా జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యానికి ప్రతినెల దాదాపు రూ.60 వేల ఆదాయం కోల్పోతుందన్నారు. దీనిపై అధికారులు స్పందించకుంటే ఇందిరాపార్కు వద్ద దీక్ష చేస్తానని హెచ్చరించారు. భారతీయ మౌన జాతుల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రం, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులున్నారు.

జర్నలిస్టు అబ్దుల్ సత్తార్ కన్నుమూత



రామంతాపూర్: జర్నలిస్టు అబ్దుల్ సత్తార్ అనారోగ్యంతో రామంతాపూర్ ఇందిరానగర్‌లోని ఆయన స్వగృహంలో సోమవారం కన్నుమూశారు. పలు అనారోగ్య సమస్యలతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి, రవికుమార్, జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి



పాఠశాల వద్ద ఎంపీ ఈటల రాజేందర్

సరస్వతీ శిశుమందిర్‌ను సందర్శించిన ఎంపీ ఈటల

కుషాయిగూడ: కుషాయిగూడలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ప్రహరీ కూల్చివేత ఘటన నేపథ్యంలో సోమవారం మల్కాజిరిగి ఎంపీ ఈటల రాజేందర్ శిశుమందిర్ పాఠశాలను సందర్శించారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఏదైనా విషయం ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆయన పోలీసులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక బీజేపీ నేతలు కాసుల సురేందర్‌గౌడ్, మర్రి మోహన్‌రెడ్డి, చల్ల ప్రభాకర్, లక్ష్మణ్‌గౌడ్, రమేష్‌యాదవ్, గణేష్ ముదిరాజ్, మహేష్, సందీప్ తదితరులున్నారు.

◆ ప్రహరీ కూల్చివేతపై స్కూల్ ప్రిన్సిపాల్ కొడారి రాధిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పక్కనే ఉన్న పోచమ్మ ఆలయ ప్రతినిధులతో నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుని రెండేళ్ల క్రితం ప్రహరీని నిర్మించామన్నారు. 18న కందాడి గౌతమ్‌రెడ్డి ప్రోద్బలంతోనే దినేష్, బాల్‌రాజు అనే వ్యక్తులతో పాటు పలువురు స్కూల్‌లోకి అక్రమంగా చొరబడి ప్రహరీని కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్‌ను నడిపించేందుకు యువత ముందుకురావాలి



జిమ్‌లోని పరికరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం సీడీఎస్ భవన్‌లో ఉన్న జిమ్‌ను స్థానిక యువకులు జిమ్‌ను నడిపించేందుకు ముందుకురావాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. సోమవారం నాచారం సీడీఎస్ భవన్‌లో ఉన్న జిమ్ పరికరాలను జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ అధికారులతో కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జిమ్‌లో విలువైనా పరికరాలు ఉన్నాయన్నారు. కొన్ని చోరీకి గురయ్యాయని పేర్కొన్నారు. యూత్ అసోసియేషన్, స్థానిక యువత ముందుకొచ్చి జిమ్‌ను నడిపిస్తే సొంతంగా రూ.లక్ష తో కొత్త సామగ్రి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎవరూ ముందుకు రాకపోతే జిమ్‌ను మరో ప్రాంతానికి తరలిస్తామని స్పష్టం చేశారు. ఈఈ నాగేందర్, డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వినీత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక నేతలు తదితరులున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



బాక్స్‌డ్రైన్ డీసిల్టింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: నాలాల డీసిల్టింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం పీవీఎన్‌కాలనీ నుంచి సత్యరాఘవేంద్రకాలనీ వరకు జరుగుతున్న డీసిల్టింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బాక్స్ డ్రైన్ల మ్యాన్‌హోల్స్ వద్ద ఆధునిక విధానం (బకెట్ సిస్టమ్) ద్వారా పూడిక తీత పనులు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులను పూర్తి చేస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించామన్నారు. ఏఈ శ్రీకాంత్, రజనీకాంత్, బాబు, సత్యనారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

15 రోజుల్లోగా పరిష్కరించాలి



జలమండలి జీఎంతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: తమ సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. సోమవారం వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, బీజేపీ నేతలతో కలిసి జలమండలి జీఎం సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీబీ సూర్యనగర్, సంతోషిమానగర్, నెహ్రూనగర్, ఆఫీసర్స్ కాలనీ, శ్రామికనగర్ తదితర ప్రాంతాల్లో పైపులైన్లు మార్చాలని గత మూడేళ్లుగా జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆయా ప్రాంతాల్లోని జలమండలికి చెందిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సాయిబాబా, రామకృష్ణారావు పాల్గొన్నారు.

యూటర్న్ ఏర్పాటుకు తగిన చర్యలు



మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ కాలనీకి వెళ్లేవారి కోసం త్వరలో యూటర్న్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని నాచారం కార్పొరేటర్ శాంతి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కోరారు. సోమవారం రాఘవేంద్రనగర్, ఇందిరానగర్‌కు వెళ్లే మూసివేసిన డివైడర్‌ను ట్రాఫిక్ అధికారులు, కాప్రా సర్కిల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. వ్యాటూ జోన్ నుంచి రాంగ్ రూట్‌లో కాలనీకి వెళ్లేవారు ప్రమాదాలకు గురౌతున్నారని, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో స్థానికులు చెబుతున్నారు. కాలనీవాసుల కోసం యూటర్న్ ఏర్పాటు చేస్తే బాగుటుందన్నారు. డీఈ బాలకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై జగన్, ఏఈ కీర్తి, వినిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

త్వరలోనే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



తుర్కపల్లి రైల్వేగేట్ వద్ద పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

అల్వాల్: రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని రైల్వే అధికారులు వివరించారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని తుర్కపల్లి రైల్వేగేట్ వద్ద సోమవారం రైల్వే సెక్షన్ ఆఫీసర్ రవిప్రకాష్, ప్రాజెక్టు అధికారి ఉషన్‌రెడ్డి, ఇంజినీర్ నర్సింహారెడ్డి, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఆర్‌యూబీ నిర్మాణంతో స్థానికంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. స్థల సేకరణ సమస్య లేకపోవడం వల్ల ఏడాదిలోగా పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అధికారి సుజయ్, నాయకులు డోలి రమేష్, అనీల్‌కిషోర్‌గౌడ్, శోభన్‌బాబు, ఢిల్లీ పరమేష్, దేవేందర్, జావీద్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీ సిమెంట్‌కు 5 స్టార్ రేటింగ్

తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్ల అందజేత



మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ భారతీ అల్ట్రాఫాస్ట్‌లో 5 స్టార్ గ్రేడ్‌ను సాధించిందని సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ తెలిపారు. సోమవారం మేడిపల్లిలో 150 మంది తాపీ మేస్త్రీలకు రూ.1 లక్ష చొప్పున ప్రమాదబీమా బాండ్లను అందజేశారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోల్చితే భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్ రూ.20 అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. డీలర్ శంకర్ రెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ సతీష్‌రాజ్, టెక్నికల్ ఆఫీసర్ మహమ్మద్ సహెర్, బద్రి, తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

శిఖర దర్శనంతో శివానుగ్రహం



మల్కాజిగిరి: అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథాలయం శిఖర దర్శనంతో శివానుగ్రహం కల్గుతుందని, తాండవ కాశీ క్షేత్రం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీస్వామి అన్నారు. నేరేడ్‌మెట్ ఆలయంలో మూడ్రోజులుగా జరుగుతున్న శిఖర ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. యాగశాలలో పూర్ణాహుతిలో స్వామీజీ పాల్గొని, శిఖర కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి యంత్ర ప్రతిష్ఠ, సతీసమేత నవగ్రహ ప్రతిష్ఠలను చేశారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ జీఎం. రమేష్, అధ్యక్షుడు రాజారామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రాజు, ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మౌలాలి: కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పిల్లి నర్సింగరావునగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆ పార్టీ మండల కమిటీ సభ్యురాలు మంగ మాట్లాడుతూ.. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టులకు ప్రజలకు మధ్య కొంత అంతరం ఉందని, అందుకే యువత కమ్యూనిజానికి దూరం అవుతున్నారన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం ప్రతినిధులు రాజ్యలక్ష్మి, అనూష, అనిత, షాహిద్, నరసమ్మ, లక్ష్మి, రజిత, రమేష్ పాల్గొన్నారు.

ఉప్పల్: సీపీఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఉప్పల్ సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వినోద, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, వెంకటేష్, ప్రభాకర్, సుగుణమ్మ, శశి, నవీన్ ఉన్నారు.

ఉచితంగా యోగా, ధ్యానం శిక్షణ తరగతులు

అల్వాల్: సత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్వాల్ వెంకటాపురం పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో 21 నుంచి 10 రోజుల పాటు ఉచితంగా యోగా, ధ్యానం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగా మాస్టర్ రంజిత్ గురూజీ తెలిపారు. నేడు పరిచయ కార్యక్రమంతో క్లాసులు మొదలవుతాయని, క్లాసులు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత 20 ఏళ్ల నుంచి రెండు తెలుగురాష్ట్రాల్లో కొన్ని వేల మందికి ఈ విద్యను ఉచితంగా అందించామని, యోగాభ్యాసం నేర్చుకుని వారి జీవితాల్లో అనేక మార్పులు పొందారని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 9885511552.

కుషాయిగూడ ఏసీపీ బదిలీ

కుషాయిగూడ: కుషాయిగూడ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న టి. మహేష్ బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీపీ మహేష్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనగా.. జోగులాంబ గద్వాల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డిని కుషాయిగూడ ఏసీపీగా నియమించారు.

జలమండలి కార్యాలయంలోకి బీజేపీ నేతలు



జీఎం సునీల్‌ను ముట్టడించిన బీజేపీ నాయకులు

అల్వాల్: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జలమండలి సైనిక్‌పురి డివిజన్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్, అధికారులను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో కాలనీలవాసులతో కలిసి ముట్టడించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో నీటి సరఫరా 40 నిమిషాలకు మించి రావడంలేదని, కనీసం గంట వదలాలని, వాటర్ ట్యాంకర్లు చాలా ఆలస్యంగా వస్తున్నాయన్నారు. పలుచోట్ల పవర్‌బోర్లు పనిచేయడం లేదని, వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు. అనంతరం సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని జీఎం హామీ ఇవ్వడంతో విరమించారు. బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, సునీత, నాయకులు ఉపేందర్‌రెడ్డి, రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ నిమ్మ కృష్ణారెడ్డి, మల్లిఖార్జునగౌడ్, నాగరాజు, శేఖర్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆదిత్య, సాయిబాబా, ఓంప్రకాష్, వెంకట్‌యాదవ్, నందు, మురళీ, బాబాన్‌సింగ్, సురేష్, లక్ష్మణ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలోని గుడిసెల తొలగింపు

తమకు కేటాయించిన స్థలంలోనే ఉన్నామంటున్న బాధితులు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు



మేడిపల్లి: మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించినా.. కబ్జాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, మేడిపల్లి మండల తహసీల్దార్ హసీనా అన్నారు. సోమవారం మేడిపల్లి మండలంలోని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వినాయకనగర్‌లోని ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 103లోని భూమిలో కొందరు స్థానికులు గుడిసెలు వేయడంతో సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ సాయంతో కొన్ని రూమ్‌లతో పాటు గుడిసెలను తొలగించారు. 2007లో అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 150 మందికి 60 గజాల చొప్పున పట్టాలు ఇచ్చారు. కానీ అప్పటి నుంచి ల్యాండ్ పొజిషన్ చూపించలేదని బాధితులు వాపోయారు. అప్పటి నుంచి స్థలం కోసం ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా.. తమ సమస్యను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకెవరూ.. న్యాయం చేయకపోవడంతో కేటాయించిన స్థలంలోనే గుడిసెలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. తమకు అధికారులే న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు బాధితులు మొరపెట్టుకున్నారు.